నీడ

పడమర గాలిలా వచ్చివాలేడు, ప్రసాదం.

వాలకంలో ఆ వేడీ సెగా కనిపిస్తూనే వున్నై.

సిగరెట్‌ని కసిగా వూదేస్తున్నాడు, ఉఫ్ ఉఫ్ మంటూ. నుదుటిమీద నరాలు బిరుసెక్కి ముడిపెట్టిన నులకతాడులా కనిపిస్తున్నై.

కుర్చీలో కూర్చున్నాడు. ఏదో పత్రికని చేతిలోకి తీసుకుని, మరుక్షణం చిర్గా దాన్ని నా మంచం మీద గిరవాటేశాడు. నేను మంచం మీద లేచి కూర్చున్నాను.

ఏదో జరిగిందని తెలుస్తూనే ఉంది. నేనుగా పలకరిస్తే... ప్రసాదం పొంగుని ఆపడం కష్టం. క్షణాల తరువాత వాడే చెప్తాడు.

వాడి తత్వం నాకు తెలియనిదా మరి. నీళ్ళలో నీళ్ళలా కలిసిపోయినవాళ్ళం మేమిద్దరమూ.

బాల్కనీలోకి వెళ్లి, పిట్ట గోడ మీదికి వంగి, ఒకటి రెండు సార్లు కేకరించి వుమ్మేసి... తిరిగి గదిలోకి వచ్చాడు. కుర్చీని నా కాళ్ళవారగా లాక్కుని కూర్చున్నాడు.

కిటికీలోంచి బయటికి చూస్తున్నాన్నేను. పక్క డాబా మీద మూలగా ఉంచిన పచ్చగడ్డిని కిందికి తీసుకుపోతున్నాడు, ఆ యింటి వారబ్బాయి గోపి. వాడు పదేళ్లవాడు. బుజాన జందెం పోగు, నుదుట విభూతి రేఖలు, పింజెపోసి కట్టిన పంచె! శుద్ధ శ్రోత్రియ కుటుంబంలో ఆరో సంతానంట గోపి. వాళ్ల నాన్న వైదీకం చేస్తాడు.

"నాకు మనుషులమీదా, వాళ్ల చేష్టలమీద విరక్తి పుడ్తోంది. ఛీ... ఛీ... పెంట బుద్ధులూ, పెంట ఆలోచనలూ".

ప్రసాదం కేసి చూసేను. క్రింది పెదవిని పైపంటితోనొక్కి, మరో సిగరెట్‌ని

పాకెట్‌లోంచి తీస్తున్నాడు.

"ఏంవైంది?" అడిగేను.

"మా రాఘవరావ్ మావ గారింట్లో ఘనమైన సన్మానం జరిగింది. జుట్టులో జొనిపి, తల పక్కకి తిప్పి అన్నాడు.

"వివరంగా చెప్పు"

"నే వెళ్లేసరికి వాళ్లింట్లో హోమ్ పార్లమెంట్ జరుగుతోంది. మా అత్త... భర్తకీ, ఆమె అత్తకీ, తన పిల్లలకీ ఉపన్యాసం ఇస్తోంది. సారాంశం ఏమిటంటే... ప్రసాదం గాడి రాకపోకలకి మరీ అడ్డూ ఆపు లేకుండా పోతోంది. వాడి తిరుగుడూ, ప్రవర్తన చూస్తుంటే నాకెందుకో రెండు విధాల అనుమానంగా ఉంది. వాడి ఆరాటం మన నళినిని చూసయినా కావాలి, లేదా ఉన్నట్టుండి మన దగ్గర కొంత డబ్బు ఉడాయించుకుపోవడమైనా కావాలి. ఇదీ ఆమె నన్ను విశ్లేషించి తీసిన ఫోటో".

నేను సన్నగా నవ్వాను. నా నవ్వు ప్రసాదంకి చిరాకేసింది.

"ఆమె భయానికి అర్థముంది ప్రసాదం. ఆడపిల్ల తల్లి, డబ్బున్నవాళ్లు. అందులోనూ ఆ ఆడపిల్ల ఎమ్మే చదివి లెక్చరర్‌గా పనిచేస్తున్న యువతి."

"అంతమాత్రాన యింత దారుణంగా ఆలోచించడమేనా?"

"అవును. పరిస్థితులూ, పరిసరాలు అలాంటివి. నేన్నీకు గతంలో కూడా ఒకసారి చెప్పేను గుర్తుందా. నువ్వు కేవలం ఒక ప్రైవేట్ కంపెనీలో స్టెనోవి. ఆకారం, వేషధారణా... చూసేవాళ్లకి నువ్వు ఏపూటకాపూట కనపడ్డవాడి నెత్తిన చెయ్యిపెట్టి బతికే రకానివనే అభిప్రాయాన్ని కలుగజేస్తయ్. మరి, అలాంటి పరిస్థితుల్లో... నువ్వెంత బంధు ప్రీతితో, ఆప్యాయతతో నిష్కల్మషంగా మీ బంధువుల ఇళ్లకు తిరిగినా... వాళ్లకి మాత్రం నీ పట్ల సదభిప్రాయం కలగదు. ఈ వాస్తవాన్ని నీకు నేను ఇదివరకే చెప్పాను. మీ అత్తయ్య నా ఆలోచన నిజమని ఋజువు చేసింది, అంతే."

"ఆఁ.. అంతే... ఆమె డబ్బుమీద ఆశ కలవాణ్ణయితే, వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడల్లా పళ్ళూ, పూలూ, మిఠాయిలూ, బిస్కెట్లూ తీసుకుపోతానూ, షికార్లకూ,

సినిమాలకూ నా డబ్బులు పెడతూనూ ఎందుకు తిరుగుతాను?"

అదే నేనూ అడుగుతున్నాను. అయినా, నీకెందుకురా ప్రసాదం ఈ తిరుగుళ్లంటే విన్నావా? మా అత్తయ్య, మా మామయ్య, మా నళిని, మా రవి అంటూ అక్కడికిపోతావాయె. అదేమంటే ఒొంటరివాణ్ణి, నా అవసరాలకీ ఎంత కావాలి?... అని ఎదురు ప్రశ్న వేస్తావ్. నీకు తగలాల్సిన దెబ్బే తగిలింది. అంతే కావాలి" చిరుకోపంతో అన్నాను.

"అంటే బాంధవ్యాలు ఇంతలో ఉన్నాయన్న మాట"

"అవును. విలువలు త్వరత్వరగా మారి పోతున్నయ్. ఇది ఈ యుగలక్షణం భాయ్. మరీ సీరియస్‌గా తీసుకోకు. నీ పని నువ్ చేసుకు పో. ఎప్పుడో వాళ్లు కనిపిస్తే "హలో"అని సాగిపో..అంతే."

చాలాసేపు మౌనంగా కూర్చుండిపోయాడు, ప్రసాదం.

చీకటి పడింది.

ఆదివారం వాతావరణం... వీధిలో ధ్వనిస్తోంది.

కుర్చీలోంచి లేచి బయటకి బయల్దేరాడు, ప్రసాదం.

"ఎక్కడికి?" అసంకల్పంగా అడిగేను.

"మధు వాళ్ళింటికి పోయొస్తాను"

నేనేమీ మాట్లాడలేదు. ప్రసాదం వెళ్లిపోయాడు.

నాలో నేను నవ్వుకున్నాను. దాలిగుంటలో కుక్క సామెత గుర్తుకొచ్చింది. ప్రసాదం చిత్రమైన మనిషి. అతనికి బంధు ప్రీతి జాస్తి. అలాగే స్నేహానికి ప్రాణమిస్తాడు. నాకు ప్రాణస్నేహితుడు.

ప్రసాదం అమ్మా నాన్నా అతని చిన్నప్పుడే పోయారు. మామయ్య, ఇతర బంధువులు... అతని పెంపకాన్ని గురించి మొహాలూ చూసుకుంటుంటే అతని అమ్మమ్మ వారూ వీరూ అనే మాటలు పట్టించుకోకుండా అతన్ని శరణాలయంలో

చేర్పించేసిందట. అతరువాత కొన్నాళ్ళకి ఆమె కాలంచేసింది.

తన కాళ్లమీద తాను నిలబడటం ప్రారంభించాక, ప్రసాదంకి తన వాళ్లన్న వాళ్ల పట్ల అభిమానం పెరిగింది. తానొక ఉద్యోగస్తుడైనాడు. బంధువుల ఇళ్లకి వెళ్లడం, తరచు అక్కడ పదిమందితో కలిసి సరదాగా గడపడం... అతనికి అభిమాన విషయాలైనాయి. ప్రసాదం మామ రాఘవరావ్, అతని బాబాయి చంద్రశేఖరం ఇంకా నాలుగైదు కుటుంబాల దూరపు బంధువులు... అంతా ఈ వూళ్లోనే ఉన్నారు.

ప్రసాదం మనస్తత్వాన్ని గురించి నాలో నేను వితర్కించుకుంటుంటే ఆశ్చర్యంగా ఉండేది నాకు.

న్యాయానికి బంధువులందరిచేత ఆదరింపబడలేదని తెలుసు కనుకా, శరణాలయంలో పెంచబడిన వాస్తవం తెలుసు కనుకా... ప్రసాదం ఈ జనానికి దూరంగా ఉండాలి, ఇంకా తరచి చూస్తే వాళ్లపట్ల అంతరాంతరాల్లో అతనికి కోపమో, ద్వేషమో పేరుకుపోయి ఉండాలి. కాని, దీనికి విరుద్ధంగా అతనికి బంధుప్రీతి ఉబుకుతోంది.

రాఘవరావ్ మామయ్య గారింట్లో ధ్వనించిన నిరసనకు బాధపడిన ప్రసాదం... ఆవెంటనే మధు వాళ్ల ఇంటికి వెళ్లటం.... మరీ విడ్డూరంగానే తోచిందినాకు.

మధు చంద్రశేఖరంగారి అబ్బాయి. అంటే ప్రసాదంకి బాబాయి కొడుకు. అతను ఏదో కంపెనీలో పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. మధు భార్య వసంత కూడా కార్పొరేషన్‌లో ఆఫీసరు. వాళ్లకో అబ్బాయున్నాడు. వయస్సు పదేళ్లు. పేరు రాజు, రాజు అంటే ప్రసాదంకి వల్లమాలిన ప్రేమ, అభిమానం. అందువలన కూడా ప్రసాదం తరచుగా మధు వాళ్ళ ఇంటికి వెళ్తూ ఉంటాడు. ఇవన్నీ అతని ద్వారా నాకు తెలిసిన వివరాలే!

ఉదయం నుంచీ గదిలోనే కూర్చుండి పోయానేమో... మనస్సుకి ఇరుగ్గా తోస్తున్నది. అఖిలన్ నవల "చిత్రసుందరి" పూర్తి చేశాను. వేరే ఏదైనా పుస్తకం

తీద్దామా అనిపించింది. కాని, చదివి చదివి పుస్తకాలంటేనూ విసుగ్గానే వుంది.

క్లబ్బు దాకా పోయి, కాస్సేపు టి.టి. ఆడి వస్తూ వస్తూ హోటల్లో భోంచేసి రావచ్చుని లేచి బయటికి బయల్దేరాను.

ఆకాశం మబ్బులు కమ్మింది. చల్లగాలి వీస్తోంది. ప్రాణం తేరుకున్నట్లయింది. పేవ్‌మెంట్ మీదుగా నడక సాగించాను.

...రాత్రి పదిగంటలవుతోంది. పుష్పవర్షంలా తుంపర మొదలైంది.

...ఇంటికి చేరేను.

గుమ్మంలో ఎదురైనాడు గోపి. "ఉండండి. మీరొస్తే చెప్పమంది మా అక్క" అంటూ గబగబా వాళ్లింట్లోకి పరుగెత్తాడు. ఏమీ మాట్లాడే అవకాశం ఇవ్వలేదు నాకు. తలుపు తీసి లైట్ వేసుక్కూర్చున్నాను.

సరళ వచ్చింది, "మీ ఫ్రెండ్ ప్రసాదం గారు వూరుకి పోయానని చెప్పమన్నారు. నాలుగైదు రోజుల తరువాత వస్తారట" అంది కూర్చుంటూ. ఈ వార్త చెప్పటానికి తానుగా ఎందుకు రావాలో అర్థం కాలేదు నాకు.

సరళతో నాకు గోపి ద్వారా పరిచయమైంది. మొదట్లో తరచుగా మా గదికి వస్తూ ఉండేది. హైస్కూల్ చదువుతో ఇంట్లో కూర్చున్న పిల్ల. పుస్తకాలూ, పత్రికలూ తీసుకుపోతూ వుంటుంది. సరళకి ఇంకా చదువుకోవాలనే ఉత్సాహం ఉంది. ప్రయివేటుగా బి.ఏకి తయారవవచ్చుఅని నేను ప్రోద్బలిస్తే... వాళ్లనాన్న అతి కష్టంమీద ఒప్పేసుకున్నాడు. నా గురుత్వంలో ఎంట్రెన్స్ టెస్ట్ పాసయి, మొదటి సంవత్సరం పరీక్షకు తయారౌతోంది.

"మీతో మాట్లాడాలి". అని పమిట కొంగుని వేలితో ముడిపెడుతూ నేలచూపులు చూడసాగింది.

"వాళ్ల రాఘవరావ్ మామయ్యగారింట్లో జరిగిన సంఘటనకి మీ ఫ్రెండ్ చాలా బాధపడుతున్నాడు. అందుకనే ఈ వూరు ప్రయాణం పెట్టుకున్నారు." అని ఒక్కక్షణం ఆగింది. తలను కుర్చీకి ఆనించి ఇంటి కప్పును చూస్తూ కూర్చుంది.

క్షణాల తర్వాత అన్నది. "నన్ను కూడా తనతో రమ్మన్నాడు." నేను ఉలిక్కి పడ్డాను. సరళ, ప్రసాద్ మధ్య స్నేహం, చనువు చాలా దూరం నడిచేయనిపించింది.

"తనకు కంపెనీ కావాలిట. మా నాన్న సంగతి తెలుసుగా. మీ దగ్గర చదువుకోను వస్తుంటేనే రోజూ సాధిస్తూ వుంటాడు. ఒంటరిగా గడపదాటటమంటే... మా ఇంట్లో ఎనిమిది శవాలూ లేచినట్లే. రాలేనని చెప్పాను. మీరు వెళ్లి రాకూడదూ" నా కళ్లల్లోకి చూసింది.

సరళ చాలా ఎదిగిపోయింది అనిపించింది. నిన్న మొన్నటిదాకా సరళ చూస్తుంటే... 'చింతచిగురు పులుపనీ, చీకటంటే నలుపనీ చెప్పండే తెలియని చిలిపి పిల్ల, అది చెరువులోన ఈదుతున్న చేపపిల్ల అని అనుకుంటూ వుండేవాణ్ణి. ఇవాళ నా అభిప్రాయం మార్చుకోవాలనిపిస్తోంది.

"ఇంతకీ ప్రసాదం ఎక్కడికి వెళ్లినట్లు?" అడిగేను.

"తెలీదు. రాజుని తీసుకుని వెళ్తాలెండీ అంటూ గబగబా వెళ్లిపోయారు."

"చిత్రమైన మనిషి" అనుకుంటూ లేచాను. సరళకూడా లేచింది, గుమ్మందాకా సాగనంపి, నేనూ బయటికి కదిలేను.

నేను మధు ఇంటికి వెళ్ళేసరికే రాజుని తీసుకుని వెళ్లిపోయాడు, ప్రసాదం. తిరుపతి, చంద్రగిరి పోయొస్తామని వెళ్ళాడట.

వారం గడిచింది.

తెల్లవారుతూనే వచ్చాడు, ప్రసాదం. తలుపు తీయగానే కళ్లొత్తుకుంటూ బావురుమన్నాడు. ఆశ్చర్యంతో గతుక్కు మన్నాన్నేను. మెల్లిగా నడిపించుకుంటూ వచ్చి, నా మంచంమీద కూర్చొబెట్టాను. అతని అరచేతిని నా చేతుల్లోకి తీసుకుని లాలనగా చేతిని నొక్కేను. వెక్కిళ్ల పర్యంతంగా ఉంది ప్రసాదం పరిస్థితి, తననుతాను సంబాళించుకోడానికి చాలాసేపు పట్టింది. ఆ తర్వాత చెప్పాడు. తాము వెళ్లినప్పుడు చంద్రగిరిలో భారీవర్షంట. రాజూ, తనూ ఆ వర్షంలో తడిసేరట. ఆ సాయంత్రం నుంచీ రాజుకు తీవ్రమైన జ్వరం ట. రాత్రికి ఇంటికి తీసుకువచ్చాడుట.

"ఇల్లుచేరి నాలుగురోజులైంది. రాజుని కంటికి రెప్పలా చూసుకుంటూ అక్కడే వుండిపోయాను. ఈ నాలుగురోజుల్లోనూ జ్వరం తగ్గకపోగా, కాళ్లూ చేతులూ చచ్చుబడినై. వొళ్లంతా నొప్పులు. పిల్లవాడు బెడ్‌లో కూడా కదలలేక పోతున్నాడు. రాత్రి కార్లో మద్రాస్ తీసుకుపోయారు" అని ఆపేడు. రుమాలుతో మొహం తుడుచుకుని మళ్లీ అన్నాడు, "వెళ్తూ వెళ్తూ మధు, వసంత అన్నమాటలు గుర్తుకొస్తుంటే తల బాదుకు చావాలనిపిస్తోంది. కావలని నిలువునా వాళ్ల పిల్లవాణ్ణి ఈ గండంలోకి తోశానుట నేను. నేనూ మద్రాస్ వస్తానంటే వీల్లేదన్నారు"

నాకూ బాధకలిగింది. "నీ బంధుప్రీతి చివరికి నీకు అన్నీ బాధల్నే కొని తెస్తోంది" అన్నాను.

ఆ తర్వాత నాలుగు రోజులకి రాజు చనిపోయాడు. మధు, వసంత ల దుః ఖాన్ని చూడలేక పోయాం మేము. ప్రసాదం బాబాయి... చంద్రశేఖరం గారితో సహా వాళ్లంతా రాజు మరణానికి ప్రసాదమే కారణమని తిట్టిన తిట్టు తిట్టకుండా దూషించేరు.

ఆరోజు

ఒక రాత్రివేళ ఎందుకో మెలుకవ వచ్చి చుట్టూ చూశాను. గదిలో ప్రసాదం లేడు. అతని సూట్‌కేస్ కూడా లేదు, అంతే.

ప్రసాదం ఏమయ్యాడో, ఎటుపోయాడో ఎవరికి తెలీలేదు. అతన్ని నేను మళ్లీ కలుసుకోలేదు.

నాకు బెంగుళూరుకు ట్రాన్స్‌ఫర్ అయింది. శకుంతలతో నా పెళ్లి జరిగింది. నేనొక ఇంటివాణ్ణయి సంసార గొడవల్లో పడిపోయాను.

నాలుగేళ్లు గడిచేయి.

ప్రసాదం నుంచీ ఉత్తరం వచ్చింది. అనూహ్యమైన పరిణామం. ఆనందంతోనూ, ఆశ్చర్యంతోనూ చదివేను. "మూర్తి.. డిసెంబరు 13న నాపెళ్లి. పెళ్లికూతురు మీ శిష్యురాలు... సరళే, గుర్తుంది కదూ, అవధాన్లగారమ్మాయి. అదే

గోపి అక్కయ్య పెళ్లి తిరుపతిలో. నాకు బంధుప్రీతి ఎక్కువ అని, దాంతో అనవసరంగా ఇబ్బందులు కొని తెచ్చుకుంటానని అంటూ ఉండేవాడివి నువ్వు. నిజమే. బంధుప్రీతి అనేది ఒక ఉన్మాదం అయితే, స్నేహం అనేది ఒక వ్యసనం అంటోంది మీ సరళ. నాతో నీ స్నేహం వల్లనే తనతోనూ నేను స్నేహం చేశానట; ఆ స్నేహం వల్లనే నేను తనను ప్రేమించానట; వాళ్ళనాన్నావాళ్ళంతా వొద్దన్నా కూడా తనను పెళ్లి చేసుకుంటున్నానట. నువ్వేమంటావో మరి. పెళ్లికి నువ్వు వస్తావని నాకు నమ్మకం. వుంటాను మరి. నీ ప్రసాదం."

ప్రసాదం గురించి ఆలోచిస్తూ కూర్చుంటే... "అనారోగ్యానికి గురిచేసే తినుబండారాలనే రోగి జిహ్వా కోరుతూ వుంటుంది. అవే అతనికి మక్కువ, ప్రాణం." అనే మాటలు గుర్తుకొచ్చాయి.

మమతల పూలే ఎప్పుడూ ప్రసాదం కోరికల కవాటాన్ని తెరుస్తూ వుంటాయనిపించింది.

ఆఫీసు పనుల వొత్తిడి వలన ప్రసాదం పెళ్లికి వెళ్ళలేకపోయాను.

చాలా కాలం తరువాత... ప్రసాదం నాకు జాబు వ్రాసేడు.

అందులో చివరి వాక్యాలు ఇలా ఉన్నై.

"నీకు తెలుసో తెలీదో మూర్తి. మీ శిష్యురాలు... సరళ... నానుంచి విడివడి వేరే వుంటోంది. ఆమె ఇప్పుడు...టీచర్. నేను తన పుట్టింటివాళ్ళకి ఆసరాగా వుండటం, బంధు ప్రీతి అంటూ బాధ్యతల్ని వహించడం..ఆమె దృష్టిలో నేను చేసిన నేరాలు. తన భవిష్యత్తుకూ, తనకు మాత్రమే నేను బాధ్యత వహించాలట. ఇది ఆమె ఆంక్ష. ఇదే మా వేర్పాటుకి కారణం. సిల్లీగా లేదూ?"

అవును సరళ సిల్లీగానే ప్రవర్తించింది!

చంద్రుడుకేసి చూస్తూ నడుస్తున్నా, వెనకనుంచీ చీకటి మీదబడి దబాయిస్తుందన్న నిజం... ప్రసాదంకి... ఇన్ని అనుభవాల తరువాత కూడా... ఇంకా తెలీలేదు మరి!!

(జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక ...1984)